ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
05-09-2024
గురువారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 06 | పేజీలు : 8 | వెల : 4
JB జయభేరి



# విలవిలలాడుతున్న బెజవాడ

మనిషి ప్రకృతి ముందు ఎంత అల్పుడో మొన్న కేరళలోని వయనాడ్ బీభత్సం తెలియజేస్తే లేటెస్ట్‌గా బెజవాడ వరదలు మరోసారి కన్నెర్రశాయి. ముఖ్యంగా విజయవాడ సిటీ మధ్యలో ప్రవహించే బుడమేరు అనే చిన్న నది నాలుగు జిల్లాల ప్రజలను బెంబేలెత్తిస్తోంది. విజయవాడ సిటీ అయితే రెండు రోజులుగా నిద్ర పోవడం లేదు. సగానికి పైనే నగరం మొత్తం నీటిలో మునిగిపోయింది.

కనీ, వినీ ఎరుగని వరదలివి. ఒక్కసారిగా కృష్ణమ్మ ఉప్పొంగిపోయింది. కృష్ణా నదిలో సంగమించే మున్నేరు.. బుడమేరు ఉగ్రరూపం దాల్చాయి. కుండపోత వానలతో వాన నీరు వరదనీరుగా మారి ఊళ్లను.. విజయవాడ నగరంలోని పలు కాలనీలను ముంచెత్తింది. గత రెండు దశాబ్దాల్లో రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిన అతి పెద్ద వరదల్లో ఇప్పుడు విజయవాడ వరద కూడా వచ్చి చేరింది. విజయవాడ నగరంలో 40% పైగా ప్రాంతము వరద ముంపునకు గురయింది. నగరం చుట్టూ ఉన్న రెండు నదులు, కృష్ణా – బుడమేరు ఒడ్డు దాటి నగరాన్ని ముంచెత్తాయి. విజయవాడలో ఎప్పుడూ వరద అంటే తెలియని చాలా ప్రాంతాలు కూడా ఈసారి వరదల్లో మునిగిపోయాయి అంటే వరద తీవ్రత అర్థం చేసుకోవచ్చు. ఈ వరదలు ఎన్టీఆర్ జిల్లాలో 2.76 లక్షల మంది ప్రజలను ప్రభావితం చేశాయి.

...మిగతాది 2 లో

# ఏపీ కంటే బాగా పని చేశాం



జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 4:

ఎడతెరిపి లేని వర్షాలు, వరదల తాకిడికి రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఎవర్నీ కదిలించినా కన్నీటి చిత్రాలే. ముఖ్యంగా తెలంగాణలోని ఖమ్మం జిల్లా, ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాల ప్రజలు వర్షాలు, వరదలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిస్థితులు రోజురోజుకీ ఘోరంగా మారిపోతున్నాయి. దీనిపై విపక్షాల నుంచి రెండు రాష్ట్రాల్లోని అధికార పార్టీలు తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నాయి.

**పక్క రాష్ట్రం కన్నా బాగా చేశాం: రేవంత్ రెడ్డి**

...మిగతాది 2 లో

# ఓఆర్ఆర్ పరిధిలోకి మరో 51 గ్రామాలు

జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 4:

సంచలన నిర్ణయాలతో దూసుకుపోతున్న రేవంత్ రెడ్డి సర్కార్.. మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఓఆర్ఆర్ పరిధిలోని 51 గ్రామాలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేస్తూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. తక్షణమే ఈ గెజిట్ నోటిఫికేషన్ అమల్లోకి రానున్నట్టు అధికారులు తెలిపారు. 51 పంచాయతీల రికార్డులు.. మున్సిపల్ అధికారుల చేతుల్లోకి రానున్నాయి. డినోటిఫై చేస్తూ పంచాయతీరాజ్ శాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.మేడ్చల్ మున్సిపాలిటీలోకి పూడూర్, రాయలపూర్ గ్రామాలు రానున్నాయి. దమ్మాయిగూడ మున్సిపాలిటీలోకి కీసర, యదగిర్ పల్లి,

...మిగతాది 2 లో

# నిర్లక్ష్యానికి ప్రతిఫలం

- 30 మంది అధికారులను ఉరి తీత
- ఉత్తర కొరియా ప్రభుత్వం సంచలన నిర్ణయం



జయభేరి, న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4:

ఉత్తర కొరియాలో ఇటీవల తీవ్రమైన స్థాయిలో వరదలు వచ్చాయి. కొండచరియలు కూడా విరిగిపడ్డాయి. ఆ ఘటనల్లో సుమారు 4 వేల మంది మరణించినట్లు తెలుస్తోంది. అయితే వరదల వల్ల ప్రాణనష్టాన్ని నివారించడంలో ప్రభుత్వ అధికారులు విఫలం అయ్యారు. ఈ నేపథ్యంలో ఆ దేశాధినేత కిమ్ జాంగ్ ఉన్ కీలక ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. సుమారు 20 నుంచి 30 మంది అధికారులను ఉరి తీయాలని ఆయన ఆదేశాలు జారీ చేసిట్లు దక్షిణ కొరియా మీడియా పేర్కొన్నది. ఇటీవల చాగంగ్ ప్రావిన్సులో వచ్చిన వరదల వల్ల వేలాది మంది మరణించారు. అనేక మంది నిరాశ్రయులయ్యారు.ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించలేకపోయిన అధికారులకు మరణ దండన విధిస్తున్నట్లు ఉత్తర కొరియాపై ఆరోపణలు వస్తున్నాయి. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు ఉత్తర కొరియా అధికారులు వెల్లడించారు. గత నెలలోనే వరద బాధిత ప్రాంతాలకు చెందిన 30 మంది అధికారులను ఉరితీసినట్లు చోసున్ టీవీకి చెందిన ఓ రిపోర్టు పేర్కొన్నది. మరణశిక్ష విధించిన అధికారుల వివరాలను స్థానిక మీడియా వెల్లడించలేదు.



# కంగనాకు ఎమెర్జెన్సీ కష్టాలు

- జయభేరి, ముంబై, సెప్టెంబర్ 4:

కంగనా రనౌత్ "ఎమర్జెన్సీ" మూవీకి కష్టాలు తప్పడం లేదు. సిక్కు సంస్థలు పెద్ద ఎత్తున ఈ సినిమాని వ్యతిరేకిస్తున్నాయి. విడుదల చేయొద్దని డిమాండ్ చేస్తున్నాయి. ఈ వివాదం కాస్త బాంబే హైకోర్టు వరకూ వెళ్లింది. కోర్టులో అయినా ఊరట వస్తుందని ఆశించిన కంగనా రనౌత్‌కి ఎదురు దెబ్బ తగిలింది. ఇప్పటికే మధ్యప్రదేశ్ హైకోర్టులో ఈ వివాదం కొనసాగుతోంది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్‌కి సెన్సార్ సర్టిఫికేట్ జారీ చేయాలని చెప్పలేమని మధ్యప్రదేశ్ కోర్టు తేల్చి చెప్పింది. ఇప్పుడు బాంబే హైకోర్టు కూడా ఇదే విషయం స్పష్టం చేసింది. మధ్యప్రదేశ్ కోర్టు తీర్పుని ఉల్లంఘించి సర్టిఫికేట్ ఇవ్వాలని ఆదేశించలేమని వెల్లడించింది. సెప్టెంబర్ 18వ తేదీలోగా ఈ సినిమాపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్నాయో చెప్పాలని సెన్సార్‌బోర్డ్‌కి తేల్చి చెప్పింది. ఈ సినిమాకి కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్న Zee Studios బాంబే హైకోర్టులో పిటిషన్ వేయగా ఈ విచారణ జరిగింది. ఇద్దరు సభ్యులతో కూడిన ధర్మాసనం ఈ విచారణ చేపట్టింది. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జీవితం ఆధారంగా తెరకెక్కిన ఈ సినిమాని కంగనా రనౌత్ డైరెక్ట్ చేశారు.

...మిగతాది 2 లో

# నా ఊపిరి ఉన్నంతవరకు సిద్దిపేట అభివృద్ధి కోసం కృషి చేస్తా

- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

జయభేరి, సిద్దిపేట :

సిద్దిపేటను ఓర్వలేక ఇక్కడి అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారు. 150 కోట్ల వెటర్నరీ కాలేజీని గద్దలా ముఖ్యమంత్రి కొడంగల్‌కు తన్నుకు పోయాడు. తీసుక పోయిన వెటర్నరీ కళాశాలను సిద్దిపేట కాంగ్రెస్ నాయకులు తీసుకరావాలి. అసెంబ్లీలో కొట్లాడి సిద్దిపేట అభివృద్ధిని కొనసాగిస్తా. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం ఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు. ఈ సందర్భంగా 190 మంది లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను

...మిగతాది 2 లో






# బెదిరించి వసూళ్లకు పాల్పడితే జైలుశిక్ష

- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరిక



జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 4:

హైడ్రాకు ఫిర్యాదు చేస్తామంటూ బెదిరించి వసూళ్లకు పాల్పడితే జైలు జీవితం తప్పదని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరించారు. కొద్ది రోజులుగా ట్రై సిటీ పరిధిలో హైడ్రా విభాగం అక్రమ నిర్మాణాల తొలగింపులు చేపడుతున్న నేపథ్యంలో కొద్దిమంది సామాజిక కార్యకర్తల ముసుగులో అక్రమాలకు పాల్పడుతున్నారు. బఫర్ జోన్, ఎఫ్.టి.ఎల్ పరిధిలో లేదా వాటి పరిసరాల్లో నిర్మాణం చేపడుతున్న బిల్డర్ల ను ఇది అక్రమ నిర్మాణమని, బఫర్ జోన్, ఎఫ్.టి.ఎల్ పరిధిలో నిర్మిస్తున్నారని హైడ్రాకు ఫిర్యాదు చేస్తామని బెదిరిస్తున్నారు.అలాగే అధికారులతో ఉన్న ఫొటోలు చూపించి హైడ్రా విభాగంలోని ఉన్నతాధికారులతో తమకు పరిచయాలు ఉన్నాయని, మీకు ఎలాంటి సమస్య రాకుండా చేస్తామని ఇందుకోసం కొంత డబ్బు ముట్టజెప్పాలని ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు. హైడ్రాకు ఫిర్యాదు చేస్తామని కొంతమంది వ్యక్తులు, సంస్థలు, బిల్డర్లను, బహుళ అంతస్తులు, వ్యక్తిగత గృహాల్లో నివాసం ఉంటున్న వారి వద్ద ఇలాంటి బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.ఎవరైనా ఇలాంటి బెదిరింపులకు పాల్పడినా ఇతర ప్రభుత్వ విభాగలైన రెవ్యూ, మున్సిపల్, నీటి పారుదల విభాగాల్లో ఇలా ఒత్తిడి చేస్తే ప్రజలు, బిల్డర్లు తక్షణమే స్థానిక పోలీస్ స్టేషన్‌లో గాని ఎస్పీ, సీపీకి గాని లేదా హైడ్రా కమిషనర్, ఏసీబీకి ఫిర్యాదు చేయాలన్నారు. ఈ విభాగాన్ని నీరు గార్చాలని చూసినా, తప్పుదోవ పట్టించే విధంగా ప్రయత్నించినా అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

▶▶ మొదటిపేజీ తరువాయి

## విలవిలలాడుతున్న బెజవాడ

విజయవాడ శివారు గ్రామాలు, ఏరియాలు పూర్తిగా బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. సింగ్‌నగర్, రామకృష్ణాపురం, నందమూరినగర్, నున్న, విజయవాడ వన్‌టౌన్, కృష్ణలంక, ఇబ్రహీంపట్నంలలో ఇళ్ళలోకి నీరు చేరిపోయింది. రామవరప్పాడు రైల్వే స్టేషన్ అయితే మొత్తానికి నీట మునిగింది. బుడమేరు వాగు తన విశ్వ రూపాన్ని చూపిస్తోంది. దాని కట్ట తెగిపోవడంతో విజయవాడను ముంచెత్తింది. చాలామంది ప్రజలు మునిగిపోయిన ఇళ్ళలోనే ఇంకా చిక్కుకు పోయారు. వారిని కాపాడటానికి కేంద్రం నుంచి ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, స్పీడ్ బోట్లు, హెలికాప్టర్లు ప్రత్యేకంగా విజయవాడ చేరుకున్నాయి.బుడమేరు అనేది మైలవరం కొండల్లో పుట్టిన ఒక పెద్ద వాగు. అయితే చరిత్రలో చాలా ఏళ్ళ నుంచి దానిని నదిగానే పరిగణిస్తూ అంటారు. ఏడాది పొడవునా ఏదో ఒక స్థాయిలో దీన్లో నీళ్ళు ఉంటాయి. కృష్ణా, గోదావరి పరివాహక ప్రాంతాల మధ్య విస్తరించి ఉన్న అతిపెద్ద మంచినీటి సరస్సు కొల్లేరుకు నీటిని సప్లయి చేసే అతి ముఖ్యమైన వాగుల్లో పుట్టిన ప్రాంతం నుంచి దాదాపు 170km దూరం ప్రవహించే బుడమేరులో ఏటా 10 వేల నుంచి 11 వేల క్యూసెక్కుల వరకు నీరు ప్రవహిస్తూ ఉంటుంది. అయితే 2005 ప్రాంతంలో వచ్చిన వర్షాలకు బుడమేరులో ఏకంగా 75 వేల క్యూసెక్కుల నీరు ప్రవహించింది అని చెబుతారు. అప్పుడే విజయవాడ చాలా వరకూ దెబ్బతింది. ఆ తరువాత 2009లో మరోసారి అలాంటి పరిస్థితే ఎదురైంది. బుడమేరు వాగు తన ప్రయాణంలో చాలా మలుపులు మెలికలు తిరుగుతూ ఉంటుంది. దానివల్ల ఎక్కువ ప్రవాహం వచ్చినపుడు అది గట్టు దాటి చుట్టూ ఉన్న ప్రాంతాలకు చేరిపోతూ ఉండేది. అందుకే ఈ నదికి బెజవాడ దుఃఖ:దాయని అని పేరు పడింది. 2005లో వచ్చిన భారీ వరదలు చూసిన ఇరిగేషన్ శాఖ బుడమేరు నది పొడవునా ఒక రిటైనింగ్ వాల్ నిర్మించాలనే సూచన చేసింది. దీనిపై అప్పట్లో కొంతమేర వర్క్ జరిగినా తరువాత పూర్తిగా పక్కన పెట్టేశారు. బుడమేరు నుంచి నీరు రెండు భాగాలుగా ఒకటి డైరెక్ట్‌గా కొల్లేరు చేరుకుంటే మరొకటి కృష్ణలో కలుస్తుంది. ఈ కృష్ణలో కలిసే భాగం మధ్యలో పోలవరం నుంచి వచ్చే కాలువతో చేరుతుంది. కొల్లేరుకు వెళ్ళే నది మధ్యలో కృష్ణ నుంచి విజయవాడ సిటీ మధ్యగా ప్రవహించే ఏలూరు కెనాల్‌లో కలుస్తుంది. బుడమేరు ప్రవహించే ప్రాంతంలో ఈ రెండు దశాబ్దాల్లో విపరీతంగా భూ ఆక్రమణలు, రియల్ ఎస్టేట్ వ్యవహారాలు పెరిగాయి. ఈ ప్రాంతాల్లో తక్కువ రేటుకే స్థలం లభిస్తుండడంతో పేద మధ్య తరగతికి చెందిన ప్రజలు కొనుగోలు చేసి ఇళ్ళు కట్టుకున్నారు. ఓటు బ్యాంకు పాలిటిక్స్ వారికి అండగా నిలబడడంతో అధికారులు కూడా మిన్నకుండి పోయారు అనే ఆరోపణలు ఉన్నాయి. దానితో బుడమేరు ప్రవహించే చాలా భాగం ఆక్రమణకు గురైంది. ఇప్పుడు భారీ వర్షాలు కురియడంతో పైనుంచి వచ్చిన వరద నీరు ఆ ఆక్రమణలను ముంచేసింది ప్రభుత్వం ఇప్పటికైనా చిత్తశుద్ధితో బుడమేరుకు ఇరిగేషన్ డిపార్ట్మెంట్ సూచనలతో రిటైనింగ్ వాల్ నిర్మించడంతోపాటు నదీ పరివాహక ప్రాంతంలోని ఆక్రమణలను తొలగిస్తేనే బుడమేరుతో బెజవాడకు ఉన్న ప్రమాదం తొలగుతుంది అని పర్యావరణ వేత్తలు నిపుణులు చెబుతున్నారు .నగరం వేగంగా విస్తరించడం, బుడమేరు వాగు వరద మార్గాన్ని ఆక్రమణలు చేయడం సమస్యను మరింత తీవ్రతరం చేసింది. బుడమేరు ప్రవాహాన్ని మళ్లించడానికి గతంలో చేసిన ప్రయత్నాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ప్రతిపాదిత పరిష్కారాలు అలాగే రాజకీయ ఎన్నికల హామీలు ఉన్నప్పటికీ విజయవాడ నగరం వరద ముప్పును తప్పించే పరిస్థితి మాత్రం ఇప్పటికీ రాలేదు. ప్రతి వానాకాలంలోనూ కొన్ని కాలనీలు వరదల్లో మునుగుతూనే ఉన్నాయి.

## కంగనాకు ఎమెర్జెన్సీ కష్టాలు

ప్రొడ్యూసర్ కూడా ఆమే. సెప్టెంబర్ 6వ తేదీనే సినిమా విడుదల కావాల్సి ఉన్నా సిక్కు సంఘాల ఆందోళనలతో వాయిదా పడుతూ వస్తోంది. సిక్కులను చూపించిన విధానం అభ్యంతరకరంగా ఉందని, చరిత్రను మార్చే ప్రయత్నం చేస్తున్నారని మండి పడుతున్నాయి ఆ సంఘాలు. ఈ క్రమంలోనే బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సెన్సార్ సర్టిఫికేట్ ఇవ్వాలని తాము ఆదేశించలేమని తేల్చి చెప్పింది. మధ్యప్రదేశ్ హైకోర్టు కూడా సినిమాలోని అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని సెన్సార్ బోర్డ్‌కి సూచనలు చేసింది. "ఇలాంటి విషయాల్లో ఓ కోర్టు అభిప్రాయాన్ని మరో కోర్టు విభేదించడం సరికాదు. పిటిషనర్లు కోరుకున్న విధంగా ఈ సినిమాకి సెన్సార్ సర్టిఫికేట్ ఇవ్వాలని మేం బోర్డ్‌ని ఆదేశించలేం. అలా అని ఈ పిటిషన్‌ని పక్కన పెట్టడం లేదు. అభ్యంతరాలు పరిగణనలోకి తీసుకోవాలని మాత్రం ఫిల్మ్ సర్టిఫికేషన్ బోర్డ్‌కి చెప్పగలం"
బాంబే హైకోర్టు
ఎంతో డబ్బు ఖర్చు పెట్టి సినిమాలు తీస్తారని, ఇలాంటి వివాదాలను గాలికి వదిలేయడం సరికాదని వ్యాఖ్యానించింది బాంబే హైకోర్టు. సీబీఎఫ్‌సీకి కొంత గడువు ఇచ్చింది. వినాయక చవితిని దృష్టిలో పెట్టుకుని వీలైనంత త్వరగా ఈ సమస్యని తేల్చాలని సూచించింది. ఈ విషయంలో ఇంకా ఆలస్యం చేయడం సరికాదని స్పష్టం చేసింది. ఇంత జరిగినా కంగనా రనౌత్ మాత్రం తనకు అనుకూలంగా పోస్ట్ పెట్టుకున్నారు. సినిమాకి సెన్సార్ చేయకపోవడాన్ని బాంబే హైకోర్టు తప్పుబట్టిందని అర్థం వచ్చేలా పోస్ట్ పెట్టారు. కోర్టులో విజయం సాధించానని ప్రచారం చేసుకుంటున్నారు.

## ఏపీ కంటే బాగా పని చేశాం

తెలంగాణలోని వరద పరిస్థితులపై తాజాగా సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ సహాయక చర్యలు తీసుకోవడంలో కానీ, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో కానీ తెలంగాణ ప్రభుత్వం, అధికారులు చాలా అద్భుతంగా పనిచేశారని అన్నారు. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తంగా లేకపోవడం వల్ల అక్కడి ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని రేవంత్ అన్నారు. ముఖ్యమంత్రిని విమర్శించడం లేదని, ప్రజలు కోలుకోవాలని కోరుకుంటున్నానని చెబుతూనే చంద్రబాబును కార్నర్ చేశారు. ఈ వీడియోను ఇప్పుడు వైసీపీ సోషల్ మీడియా బాగా వాడుకుంటోంది. రేవంత్ మాటలు వైసీపీ చేతికి మంచి ఆయుధం ఇచ్చాయి. మేం కూడా మొదట్నుంచి అదే చెబుతున్నామని ప్రచారం చేస్తున్నారు.

**విజయవాడ వరద మ్యాన్ మేడ్ డిజాస్టర్ : వైఎస్ జగన్**

వరదల నేపథ్యంలో మాజీ సీఎం వైఎస్ జగన్ విజయవాడలోని సింగ్ నగర్ ప్రాంతంలో పర్యటించారు. అక్కడి బాధితుల సమస్యలుల అడిగి తెలుసుకుని అనంతరం మీడియాలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మీద తీవ్ర విమర్శలు గుప్పించారు. సీఎం చంద్రబాబు అప్రమత్తంగా వ్యవహించకపోవడం వల్ల, ఆయన అసమర్థత వల్లనే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆరోపించారు. తన హయాంలోనూ వరుసగా మూడేళ్లు 8 నుంచి 11 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చినా విజయవంగంగా ఎదుర్కొన్నామని చెప్పారు. కనీస ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో చంద్రబాబు ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. ఎక్కడా పునరావాస శిబిరాలు ఉన్నట్టే కనిపించడం లేదని, సహాయక చర్యల కన్నా పబ్లిసిటీకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వడం దారుణమన్నారు. ఫైనల్‌గా మ్యాన్ మేడ్ డిజాస్టర్‌గా తేల్చేశారు.విజయవాడ వరదలపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలను వైసీపీ తన అధికారికి ఎక్స్ అకౌంట్‌లో పోస్ట్ చేసింది. ఒకేరకమైన వర్షం, ఒకే రకమైన పరిస్థితులున్నా ఆంధ్రలో కన్నా, తెలంగాణలో నష్టం తక్కువ జరిగిందని రేవంత్ అన్నారు. ప్రభుత్వం అప్రమంత్తంగా ఉండటం వల్లనే నష్టం తగ్గించగలిగామని చెప్పుకొచ్చారు. ఆంధ్రా ప్రభుత్వం, సీఎం చంద్రబాబు అప్రమత్తంగా లేరని వైసీపీ ప్రచారం చేస్తోంది.

**కన్నీరు పెట్టిస్తున్న వీడియోలు..**

మనిషిలోతు వరదల్లో మునిగిపోయి తిండీతిప్పలు లేకుండా ఇబ్బందుల్లో ఉన్న వీడియోలు సోషల్ మీడియాలోనూ వైరల్ అవుతున్నాయి. ప్రభుత్వం ఓ వైపు సాయం చేస్తున్నప్పటికీ ఇంకా సరిపోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. బుడమేరు వాగు పొంగడంతో విజయవాడ సిటీలోని కీలక ప్రాంతాలు నీట మునిగాయి. మొదటి ఫ్లోర్ వరకు మునిగిపోయి ఉన్నాయి. ఎక్కడా కరెంట్ లేదు.. పిల్లలకు తాగడానికి పాలు లేవు. వృద్ధులు, వ్యాధిగ్రస్తులు నిద్రాహారాలు లేక అల్లాడిపోతున్నారు. ఎక్కడికి వెళ్లాలన్నా మనిషిలోతు వరద, బోటు అడిగితే కిలోమీటర్‌కి మనిషికి వెయ్యి రూపాయలు అడుగుతున్నారు. పునరావాస శిబిరాలు ఎక్కడున్నాయో తెలియడం లేదని వాపోతున్నారు. హెలిక్యాప్టర్ల నుంచి అన్నం పార్శిళ్లు బురదలో విసిరేస్తే తీసుకోవడం, వ్యాన్ దగ్గర నీళ్ల బాటిళ్లు, అన్నం కోసం కొట్టుకోవడం లాంటి దృశ్యాలు పరిస్థితికి అద్దం పడుతున్నాయి.

# హైదరాబాద్ కు సెప్టెంబర్ టెన్షన్

✍ **జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 4:**



తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరపిలేని వర్షాలతో జనజీవనం అస్తవ్యస్థమవుతోంది. ఇప్పటికే చాలా ప్రాంతాలు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలన్ని మునిగిపోయి.. ఇళ్లల్లోకి నీరు వచ్చేశాయి. ఇక.. హైదరాబాద్ నగరంలోని చాలా ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. అయితే.. ఈరోజు నుంచి సెప్టెంబర్ నెల మొదలవుతున్న నేపథ్యంలో.. హైదరాబాద్ ప్రజలు గజగజా వణికిపోతున్నారు. ప్రతి ఏడాది సెప్టెంబర్ మాసం వచ్చిందంటే చాలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకులు వెల్లదీస్తున్న నగరవాసులకు.. ఈసారి కూడా అదే భయం వెంటాడుతోంది. ఇప్పటివరకు కేవలం వరుణుడి భయమే ఉన్న నగరవాసులకు.. సెప్టెంబర్ సెంటిమెంట్ కూడా తోడవటంతో.. ఎప్పుడు ఏం జరుగుతుందోనని.. వణికిపోతున్నాయి. దానికి కారణం.. గతంలో వాళ్లు చూసిన భీకర పరిస్థితులే.హైదరాబాద్‌లో వచ్చిన ఉపద్రవాలు చాలా వరకు సెప్టెంబర్‌లోనే వస్తుండటం.. నగరవాసుల్లో భయానికి కారణవుతున్నాయి. 1908వ సంవత్సరంలో భాగ్యనగరంలో ఉన్న మూసీ నది మహోగ్రరూపం దాల్చడంతో.. నగరంలోని సగభాగం తుడిచిపెట్టుకుపోవటం ఇప్పటికీ నగరవాసులను భయపెడుతూనే ఉంటుంది. ఆ వరదలు కూడా సెప్టెంబర్ నెలలోనే రావటం గమనార్హం. ఈ క్రమంలోనే.. 2000, 2016 సంవత్సరాల్లోనూ సెంప్టెంబర్ నెలలో కుండపోత వర్షాలు హైదరాబాద్ నగరాన్ని అతలాకుతలం చేశాయి. కేవలం 1908, 2000, 2016 మాత్రమే కాదు.. హైదరాబాద్ చరిత్రలో సెప్టెంబర్ మిగిల్చిన చేదు అనుభవాలు ఇంకెన్నో ఉన్నాయంటున్నారు నగరవాసులు.1591 నుంచి 1908 వరకు 14 సార్లు హైదరాబాద్ నగరాన్ని వరదలు ముంచెత్తాయి. 1631, 1831, 1903 సంవత్సరాల్లో భారీ వరదలతో భాగ్యనగరం అల్లాడిపోయింది. ఆ వరదలు.. పెద్ద ఎత్తున ధన నష్టంతో పాటు ప్రాణ నష్టం కూడా మిగిల్చాయి. 1908 సెప్టెంబరు వరదల్లో హైదరాబాద్ నగరంలోని ఏకంగా 2 వేల ఇళ్లు కొట్టుకుపోవటం.. 15 వేల మంది మృతి చెందటం.. 20 వేల మంది నిరాశ్రయులవటం.. ఇప్పటికీ నగర చరిత్రలో ఓ భీకర అనుభవమే. ఆ వరదల సమయంలో వారం రోజుల పాటు జనజీవనం స్తంభించిపోయింది.1631లో కుతుబ్ షాహీ ఆరో పాలకుడు.. అబ్దుల్లా కుతుబ్ షా కాలంలో వచ్చిన వరదలకు భవనాలు ధ్వంసం అయ్యాయి. మూసీ నది చుట్టు ప్రక్కల ఉన్న ఇళ్లు వరదలకు కొట్టుకుపోయాయి. వేలాది మంది నిరాశ్రయులైనట్టు చరిత్ర చెప్తోంది. 1831లో అసఫ్ జాహీ నాలుగో మీర్ ఫరుకుందా అలీఖాన్ నాసరుదౌలా పాలనా సమయంలోనూ.. భాగ్యనగరంలో భారీ వరదలు వచ్చాయి. ఆ సమయంలో.. నిర్మాణంలో ఉన్న చాదర్‌ఘాట్ వంతెన కొట్టుకుపోయింది. ఆరో నిజాం మీర్ మహబూబ్ అలీ పాలనా కాలంలోనూ.. 1903లో సెప్టెంబర్ నెలలోనే భారీ వర్షాలకు హైదరాబాద్ నగరం అల్లాడిపోయింది.ఇలా... 1968, 1984, 2000, 2007, 2016, 2020 సంవత్సరాల్లోనూ భారీ వర్షాలు కురిసి మూసీ నది ఉగ్రరూపం దాల్చింది. ఆయా సమయాల్లో జరిగిన బీభత్సానికి నగరమే సాక్షిగా నిలుచుంది. వేర్వేరు నెలల్లో వర్షాలు వచ్చినా.. సెప్టెంబర్‌లో వచ్చిన వర్షాలే బీభత్సం సృష్టిస్తుండటం గమనార్హం.అన్నింటా.. 1908వ ఏడాది మాత్రం హైదరాబాద్ చరిత్రలో ఎప్పటికీ మర్చిపోలేరు. సెప్టెంబరు 28వ తేదీ.. ఒక పీడ కలగా దాని ఆనవాళ్లు ఇప్పటికి భయపెడుతూనే ఉంటాయి. మూసీ నది ఏకంగా 60 అడుగుల ఎత్తున ప్రవహించి.. మహోగ్రరూపం దాల్చింది. 36 గంటల్లో 16 సెంటీమీటర్ల వర్షపాతం నమోదవడంతో.. హైదరాబాద్ ఆగమైపోయింది. మూసీ ప్రవాహం.. చాదర్‌ఘాట్ దాటి అంబర్‌పేట బుర్జు వరకు.. అటు చార్మినార్ దాటి శాలిబండ వరకు వరద పోటెత్తింది. ప్రాణాలు కాపాడుకునేందుకు వందల సంఖ్యలో ప్రజలు పేట్ల బుర్జుపైకి ఎక్కారు. కానీ.. మూసీ ఉద్ధ తీకి పేట్లబుర్జు కూడా కొట్టుకుపోయి.. వందలాది మంది కొట్టుకుపోయాయి. ఆనాటి బీభత్సంలో.. వేల సంఖ్యలో నగరవాసులు మృత్యువాత పడ్డారు.

## మరో 51 గ్రామాలు

అంకిరెడ్డిపల్లి, చిర్యాల, నర్సంపల్లి, తిమ్మాయిపల్లి గ్రామాలు విలీనం కానున్నాయి. పోచారం మున్సిపాలిటీలోకి బోగారం, గోధుమకుంట, కరీంగూడా, రాంపల్లి దయరా, వెంకటాపూర్, ప్రతాప సింగారం, కొర్రెముల, కాచవానిసింగారం, చౌదరిగూడ గ్రామాలు విలీనం కానున్నాయి.ఘట్కేసర్ మున్సిపాలిటీలోకి అంకుశపూర్, ఔషాపూర్, మందారం, ఎదులాబాద్, ఘనపూర్, మఠిప్యాల్ గూడ గ్రామాలు విలీనమవ్వనున్నాయి. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోకి మునిరాబాద్, గౌడవెల్లి గ్రామాలు రానున్నాయి. తుంకుంట మున్సిపాలిటీలోకి బొంరాస్ పేట, శామిర్ పేట, బాబాగుడా గ్రామాలు రానున్నాయి. అమీన్‌పూర్ మండల పరిధిలోని ఐలాపూర్, ఐలాపూర్ తండా, కిష్టారెడ్డిపేట, పటేల్ గూడ, దాయర, సుల్తాన్పూర్ గ్రామాలు అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోకి రానున్నాయి.ఇక.. పటాన్‌చెరు మండల పరిధిలోని పాటి, కర్ధనూరు, ఘనపూర్, పోచారం, ముత్తంగి గ్రామాలు తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోకి విలీనం కానున్నాయి. మున్సిపల్ అధికారుల చేతుల్లోకి పంచాయతీల రికార్డులు వెళ్లనున్నాయి. డినోటిఫై చేస్తూ పంచాయతీరాజ్ శాఖ నుంచి ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి.

**ఏఏ గ్రామాలు ఏ మున్సిపాలిటిలో విలీనమవుతున్నాయంటే..**

**పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీలో..** బాచారం, గౌరెల్లి, కుత్బుల్లాపూర్ తారామతి పేట పంచాయతీలు

శంషాబాద్ మున్సిపాలిటీలో.. బహదూర్‌గూడ, పెద్దగోల్కొండ, చిన్నగోల్కొండ, హమీదుల్లానగర్, రషీద్ గూడ, ఘంసీమిగూడ

**నార్సింగి మున్సిపాలిటీలో..** మీర్జాగూడ గ్రామపంచాయతీ

**తుక్కుగూడ మున్సిపాలిటీలో..** హర్షగూడ గ్రామపంచాయతీ

**మేడ్చల్ మున్సిపాలిటీలో..** పూడూరు, రాయిలాపూర్ గ్రామపంచాయతీలు

**దమ్మాయిగూడ మున్సిపాలిటీలో..** కీసర, యాద్గిరిపల్లి, అంకిరెడ్డిపల్లి, చీర్యాల, నర్సపల్లి, తిమ్మాయిపల్లి

**నాగారం మున్సిపాలిటీలో..** బోగారం, గోదాముకుంట, కరీంగూడ, రాంపల్లి దాయార గ్రామాలు

**పోచారం మున్సిపాలిటీలో..** వెంకటాపూర్, ప్రతాపసింగారం, కొర్రెముల, కాచివానిసింగారం, చౌదరిగూడ

**ఘట్‌కేసర్ మున్సిపాల్టీలో..** అంకుషాపూర్, ఔషాపూర్, మాదారం, ఏదులాబాద్, ఘనాపూర్, మర్పల్లిగూడ

**గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో..** మునీరాబాద్, గౌడవెల్లి పంచాయతీలు

**తూంకుంట మున్సిపాలిటీలో..** బొంరాసిపేట, శామీర్ పేట, బాబాగూడ పంచాయతీలు విలీనం

**ఏడు జిల్లాల్లో సర్వే షురూ**

ప్రస్తుతం హైడ్రా ఔటర్ రింగ్‌రోడ్డు వరకు ఉన్న చెరువులు, కుంటలు, ఎఫ్‌టీఎల్‌లు, బఫర్‌జోన్లు, నాలాలు, ప్రభుత్వ పార్కులు ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను కూల్చివేస్తున్న సంగతి తెలిసిందే. హెచ్ఎండీఏలో పరిధిలో ఏడు జిల్లాలు ఉండగా.. ఆయా జిల్లాల్లోని చెరువుల పరిరక్షణను కూడా హైడ్రా కమిషనర్‌కు అప్పగించాలని చూస్తున్నట్లు తెలిసింది. తద్వారా ఆక్రమణలకు గురి కాకుండా కాపాడవచ్చని సర్కార్ భావిస్తోంది. ఈ మేరకు హైడ్రాతోపాటు లేక్ ప్రొటెక్షన్ కమిటీ ఛైర్మన్ బాధ్యతలను కూడా రంగనాథ్‌కే అప్పగించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ బాధ్యతల అప్పగింతపై త్వరలోనే అధికారిక ప్రకటన రానున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడిస్తున్నాయి.హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న ఏడు జిల్లాల్లో చెరువుల సర్వే, ఎఫ్‌టీఎల్ నిర్ధారణ, నోటిఫికేషన్ పూర్తి చేయాలని ఇప్పటికే హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ ఆదేశించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి, మెదక్, సంగారెడ్డి, యాదాద్రిభువనగిరి, సిద్దిపేట జిల్లాల్లో చెరువులు ఉండగా.. ఆయా జిల్లాల కలెక్టర్లతో సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నవంబరు 1 లోగా అన్ని చెరువుల సర్వేతో పాటు ఎఫ్‌టీఎల్‌కు సంబంధించి నోటిఫికేషన్లు జారీ చేయాలన్నారు. హెచ్ఎండీఏ పరిధిలో మొత్తం 3,500 చెరువులు ఉండగా...ఇప్పటివరకు 265 చెరువులను నోటిఫై చేసినట్లు చెప్పారు. కాగా, హైడ్రాతో పాటు చెరువుల పరిరక్షణ కమిటీ ఛైర్మన్ బాధ్యతలు కూడా రంగనాథ్‌కే అప్పగించనున్నారనే సమాచారంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

## నా ఊపిరి ఉన్నంతవరకు..

పంపిణీ చేశారు.ఈ సందర్బంగా హరీష్ రావు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ కు వ్యంగ్యం తప్ప. పరిపాలన వ్యవహారం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పక్షాల మీద దాడులు, కక్ష సాధింపులు.. హామీలు అమలు లేదు పరిపాలన పై పట్టి లేదు. అరచేతిలో వైకుంఠం చూపించి అధికారం లోకి పాలన ఆగం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అపదలో పార్టీ పక్షాన అదుకునేందుకు పొతే ఎమ్మెల్యే ల పై కాంగ్రెస్ పార్టీ దాడులకు పాల్పడ్డారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారు పాలు నీళ్లు ప్రజలే తెలుస్తారు. రైతు రుణ మాఫీ సగం చేసి చేతి ముడుచుకున్నాడు. వాన కాలం ఐపోతుంది రైతు బందు లేదు... అవ్వా తాత లకు, వికలాంగుల కు పెన్షన్ ఇవ్వక అగం చేస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం. ప్రజలు కష్టాల్లో, ఆపదల్లో ప్రైవేట్ హాస్పిటల్లో ఖరీదైన వైద్యం పొందితే కొంత మొత్తాన్ని ఉడతాభక్తిగా సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం చేసేవాళ్లం. ఇందుకు తమ వంతు కృషి చేసిన స్థానిక కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులకు అభినందనలు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో, కేసీఆర్ నాయకత్వంలో సిద్దిపేటను తెలంగాణాలోనే బెస్ట్ నియోజకవర్గంగా మీ అందరి సహకారంతో అభివృద్ధి చేసుకున్నాం. కాని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 9 నెలల కాలంలో అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. కేసీఆర్ ఆశీర్వాదంతో రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా సిద్ధిపేట తీర్చిదిద్దుకున్నాం. 10ఏళ్లలో సిద్దిపేట రూపురేఖలు మార్చుకున్నాము. సిద్దిపేటలో అనేక విద్యాలయాలు తెచ్చుకున్నాం. సిద్దిపేటకు మెడికల్ కాలేజ్, మహిళా డిగ్రీ కళాశాల, వెటర్నరీ కాలేజీలను తెచ్చుకున్నాం. సిద్దిపేటలో విద్యార్థులకు అన్ని రకాల చదువులు అందాలనే ఉద్దేశంతో సిద్దిపేటకు అనేక విద్యాలయాలు తేవడం జరిగింది.



## గ్రామమహిళలను పెళ్లి చేసుకుంటే 4140 డాలర్లు

✍ **జయభేరి, టోక్యో, సెప్టెంబర్ 4:**

ప్రపంచంలో అత్యధిక జనాభా గల దేశంగా చైనా అవతరించింది. అయితే ప్రస్తుతం జనాభా తగ్గిపోవడంతో యువత పెళ్లి చేసుకోవడానికి పథకాలు తీసుకొచ్చింది. మారిన జీవనశైలి, పట్టణ లైఫ్‌కి అలవాటు పడిపోవడం, రిలేషన్‌లో కంటే ఒంటరిగానే జీవితం బాగుందని భావించి చాలా మంది యువత పెళ్లికి నిరాకరిస్తుంది. అయితే ఈ మధ్య జపాన్‌లో కూడా జనాభా తగ్గిపోతుంది. ఈ నేపథ్యంలో జనాభా సంఖ్యను పెంచేందుకు ఆ దేశం కొత్త పథకాన్ని తీసుకువస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఈ పథకాన్ని అమలు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంతకీ ఆ పథకం ఏంటి? మహిళలకు ఆ పథకం వల్ల ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయో మరి తెలుసుకుందాం.సాధారణంగా ఎక్కడైనా ఉపాధి కోసం పట్టణాలకు వెళ్తారు. అక్కడే ఇక సెటిల్ అవుతారు. జపాన్‌లో కూడా ఇదే తరహా జరిగింది. ప్రస్తుతం జపాన్‌లో కూడా రోజురోజుకి జనాభా తగ్గిపోతుంది. ముఖ్యంగా యువతులు ఎక్కువగా పట్టణాలకు వెళ్లి అక్కడ యువకులనే పెళ్లి చేసుకుని సెటిల్ అవుతున్నారు. ఈ క్రమంలో గ్రామీణ ప్రాంతాల్లో యువతుల జనాభా తగ్గిపోతుంది. దీంతో మహిళలకు ఓ వినూత్న పథకం తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తుంది. టోక్యోలో ఒంటరిగా ఉండే యువతులు గ్రామీణ ప్రాంతాల్లోని యువకులను పెళ్లి చేసుకుని, అక్కడే సెటిల్ అయితే వాళ్లకు డబ్బులు ఇవ్వనుంది. పెళ్లి సంబంధాలు చూసుకోవడానికి మహిళ గ్రామీణ ప్రాంతాలకు వెళ్లడానికి కావాల్సిన డబ్బులు కూడా ప్రభుత్వమే ఇస్తుంది. పూర్తిగా అక్కడే ఉండిపోతే.. 6000000 యెన్ అంటే 4140 డాలర్లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకం 2025 ఆర్థిక సంవత్సరం నుంచి ప్రారంభించాలని జపాన్ ప్రభుత్వం చూస్తోంది.టోక్యోలో వలస వచ్చిన యువతుల సంఖ్య రోజురోజుకి పెరిగిపోతుంది. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో స్త్రీలు తక్కువగా ఉన్నారని జపాన్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అయితే ఈ పథకంపై విమర్శలు వస్తున్నాయి. మహిళలు వాళ్లకు నచ్చిన నిర్ణయాలు తీసుకోవాలి. కానీ ఇలా పథకం పేరుతో బలవంతంగా గ్రామాలకు పంపించడం ఏంటని కొందరు అంటున్నారు. గ్రామాల్లో స్త్రీ పురుష నిష్పత్తిని సమానం చేయడం కోసం మహిళలకు ఇలా డబ్బులు ఇచ్చి పంపించడం ఏంటని మండిపడుతున్నారు. అయితే ఇందులో మహిళల ఇష్టాలను మార్చుకోమని ప్రభుత్వం చెప్పడం లేదు. గ్రామీణ ప్రాంతంలో ఉండే లోటును తీర్చాలని అనుకుంటుంది. దీనికోసం ఒంటరిగా జీవించే మహిళలు గ్రామీణ ప్రాంతాలకు వెళ్తే యువతుల సంఖ్య పెరుగుతుందనే ఉద్దేశంతోనే ఈ పథకం తీసుకొస్తుంది. ఆ గ్రామాల్లో కూడా ఏదైనా ఉపాధి కల్పించేవి చేయడానికి ప్రభుత్వం నగదు రూపంలో సాయం చేస్తుంది. కానీ అమ్మాయిలను వస్తువుగా చూస్తున్నారని, వాళ్ల స్వాతంత్ర్యానికి ఇది చాలా వ్యతిరేకమని కొందరు సోషల్ మీడియాలో విమర్శిస్తున్నారు. మరి ఈ పథకం అమలు అవుతుందో లేదో చూడాలి.

# జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం

## ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై చర్యలు

జయభేరి, కాప్రా :

మీర్పేట్ హెచ్ బి కాలనీ డివిజన్ పరిధిలోని ఓల్డ్ మీర్పేట్, కైలాసగిరి బస్తీలలో ఉన్న కమ్యూనిటీ హాల్ కు సంబంధించిన భూములను స్వాధీనం చేసుకొని కాపాడవలసిందిగా కోరుతూ మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రుకి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి వినతి పత్రం అందజేసిన కార్పొరేటర్ జేరిపోతుల ప్రభుదాస్. అనంతరం వారు మాట్లాడుతూ.. ఓల్డ్ మీర్పేట్ కాలనీకి సంబంధించిన కమ్యూనిటీ హాల్ కు సంబంధించిన స్థలం 450 గజాలు కబ్జా చేయుటకు ప్రయత్నం జరుగుతున్నందున అట్టి చర్యను నివారించగలరని, ఆ స్థలంలో ప్రహరీ గోడ నిర్మాణానికి జీహెచ్ఎంసీ నిధులు మంజూరై ఉన్నందున ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకొని ఆ యొక్క ప్రహరీ గోడ నిర్మాణాన్ని పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని.. కైలాసగిరి బస్తీలోని కమ్యూనిటీ హాల్ కు సంబంధించి ఉన్నటువంటి స్థలాన్ని ఆక్రమించడానికి ప్రయత్నం చేస్తూ ఇబ్బందులు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకొని ఆ యొక్క స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని చేపట్టవలసిందిగా కోరడం జరిగింది.



ఈ కమ్యూనిటీ హాల్ సంబంధించి గతంలోనే 80 లక్షల రూపాయలు నిధులు మంజూరై ఉన్నాయని తెలిపారు. ఈ రెండు స్థలాలపై తక్షణ చర్యలలో భాగంగా ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొని నిర్మాణాలు పూర్తి చేసినట్లయితే స్థానిక బస్తీలలోని ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు తెలిపారు.



## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

- గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి
- ఉచితంగా షుగర్ బీపీ ఈసీజీ 2D ECHO పరీక్షలు
- క్యాంపులో 230 మందికి ఉచిత పరీక్షలు మందులు అందజేత
- యశోద హాస్పిటల్ మలక్పేట హైదరాబాద్ వారిచే వైద్య పరీక్షలు
- ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ వారి సహాయంతో సహకరించిన సంకు కొండల్ రెడ్డి మేనేజింగ్ డైరెక్టర్ ఆర్కే హాస్పిటల్ హైదరాబాద్
- నియోజకవర్గ వ్యాప్తంగా లైన్స్ క్లబ్ సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.. లయన్స్ క్లబ్ అధ్యక్షులు వస్కుల సత్యనారాయణ

జయభేరి, దేవరకొండ :

గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని చేరువ చేస్తున్నామని దేవరకొండ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ వస్కుల సత్యనారాయణ అన్నారు. దేవరకొండ మండలంలోని జిల్లేపల్లి గ్రామాల్లో లయన్స్ క్లబ్ ఆఫ్ దేవరకొండ యశోద హాస్పిటల్ మలక్ పేట హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ వారి సహకారంతో ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ జిల్లేపల్లి వారిచే ప్రారంభించారు. గ్రామానికి చెందిన సంకు కొండల్ రెడ్డి ఆర్కే హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ హైదరాబాద్ గారి ఆర్థిక సహకారంతో 220 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

ఈ సందర్భంగా అధ్యక్షులు వస్కుల సత్యనారాయణ మాట్లాడుతూ వైద్యం కోసం పేద ప్రజలు ఖరీదైన ఆసుపత్రికి వెళ్లలేకపోతున్నారని కార్పొరేట్ ఆసుపత్రులను గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన నాణ్యమైన ఉచిత వైద్యాన్ని అందించామని తెలిపారు. నేటి సమాజంలో లయన్స్ క్లబ్ సేవలను విస్తృత పరుస్తూ మరిన్ని ఉచిత వైద్య శిబిరాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ సముద్రాల ప్రభాకర్, జోన్ చైర్మన్ వనం బిక్షమయ్య, క్యాంపు చైర్మన్ నల్ల మాద నారాయణరెడ్డి, కో చైర్మన్ నారాయణ సింగ్, గాజుల రాజేష్, గుద్దేటి జంగయ్య , సంకు కొండల్ రెడ్డి,మేనేజింగ్ డైరెక్టర్ ఆర్కే హాస్పిటల్ హైదరాబాద్, డాక్టర్ పి జె శ్యామ్సన్, వనం శ్రీనివాసులు, నీల బుచ్చయ్య, కుంచకూరి లక్ష్మణ్ కర్నాటి గోవర్ధన్, లకుమారపు మల్లయ్య, రఘురాం నాయక్, యశోద హాస్పిటల్ పిఆర్ఓ శ్రీధర్, దేప శైలేందర్ రెడ్డి,గ్రామ యువకులు సంకు కొండల్ రెడ్డి, బెక్కరి కొండల్ రెడ్డి, ఏమి రెడ్డి రవీందర్ రెడ్డి మాజీ సర్పంచ్ ఏటెల్లి వెంకటయ్య, పోతురాజు ధనరాజు, ఏటెల్లి వెంకటయ్య, సంకేపల్లి సుధాకర్ రెడ్డి, ఏటెల్లి రమేష్, సంకు మోహన్ రెడ్డి, గొట్టె శేఖర్ ,గొట్టె మల్లయ్య, సంకేపల్లి దామోదర్ రెడ్డి, ఆప్త మాలిస్టు హరి వైద్యులు తదితరులు పాల్గొన్నారు.



## అదుపు లేకుండా అక్రమ కట్టడాలు

- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- అవినీతికి అలవాటు పడుతూ విచ్చలవిడిగా పర్మిషన్లు
- అక్రమ కట్టడాలు కూల్చని మున్సిపల్ అధికారులు ఉండి ప్రయోజనం ఏంటి ?

జయభేరి, సికింద్రాబాద్ :

సికింద్రాబాద్ జోన్ ముషీరబాద్ సర్కిల్ పరిధిలోగల శివం రోడ్డులోని పక్కింటి ఇంటి నెం: 221109/BK/LIG లో నిర్మించిన అక్రమ నిర్మాణం శరవేగంగా కొనసాగుతున్న అధికారులు నిమ్మకు నీరెత్తనట్టు వ్యవహరిస్తున్నారు. సికింద్రాబాద్ జోన్ ముషీరాబాద్ సర్కిల్ పరిధిలో ఒక నిర్మాణం శరవేగంగా కొనసాగుతుంది. అయితే ఆ నిర్మాణం పర్మిషన్ ఒకల ఉంటే నిర్మాణం మరోలా ఉంటుంది. జి.హెచ్.ఎం.సి నిబంధనలను ఉల్లంఘించి ఒకే కట్టడంగా నిర్మించమే గాక ఇచ్చిన అనుమతికిమించి స్టీల్ట్ 5 గా భవనాన్ని నిర్మించడం జరుగుతుంది.

కాబట్టి అట్టి విషయం గురించి స్థానిక సర్కిల్ డిప్యూటి కమీషనర్ కి పలుమార్లు ఫిర్యాదు చెయ్యడం జరిగింది. ఫిర్యదు చేసి వారం రోజులు గడుస్తున్న కూడా అక్రమ నిర్మాణం పై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. గత సంవత్సరం డిసెంబర్ నెల 27వ తేదిన మున్సిపల్ శాఖమంత్రి ఆక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని జారి చేసిన కూడా ఆ ఆదేశాలను లెక్కచెయ్యకుండా ముషీరాబాద్ టౌన్ ప్లానింగ్ అధికారులు అవినీతికి పాల్పడుతున్నారు. కావున TSB PASS చట్టం ప్రకారం ఈ ఫిర్యాదును అనుసరించి పైన పే



ర్కొన్న భవనాన్ని తనికీలు చేసి తగిన చర్యలు తీసుకోగలరని అలాగే అక్రమ నిర్మాణాల విషయంలో నిర్లక్ష్యంవహిస్తున్న ముషిరాబాద్ టౌన్ ప్లానింగ్ అధికారులను విచారించి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని విన్నవించుకుంటున్నాం.

## విద్యుత్ సిబ్బంది అలసత్వం.. రైతుల పాలిట శాపం

- శామీర్ పేట్ మండలంలో విద్యుత్ అధికారుల తీరుతో రైతులకు తప్పని తిప్పలు
- ఉన్నతాధికారులు స్పందించాలని విన్నపం

జయభేరి, సెప్టెంబర్ 4:

దేశానికి వెన్నెముక రైతు. కానీ ఆ రైతే ఇప్పుడు సమస్యల సుడిగుండంలో చిక్కుకుపోతున్నాడు. రైతును రాజు చేయాలని, రైతు లేనిదే రాజ్యం లేదని అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు ఊకదంపుడు ఉపన్యాసాలు చేయడమే తప్ప రైతుల సమస్యల పట్ల చిత్తశుద్ధి లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులంటే చులకన భావంతో చూస్తున్నారని శామీర్ పేట్ మండలం బొమ్మరాశిపేట రైతులు వాపోతున్నారు. బొమ్మరాశిపేట గ్రామానికి చెందిన రైతు మల్లేష్ తన కున్న ఐదెకరాల పొలంలోని దేవుడి మాన్యంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం గడుపుతున్నాడు. అయితే ఆ పొలంలో విద్యుత్ తీగలు ప్రమాదకర స్థితిలో వేలడుతూ చేతికందే ఎత్తులో ఉన్నాయని, వీటిని సరి చేయాలని శామీర్ పేట్ ఏఈ సురేందర్ కు విన్నవించుకున్న పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. అసలే వర్షాకాలం విద్యుత్ తీగల వద్ద రైతులు అప్రమత్తంగా



ఉండాలని సాక్షాత్తు జిల్లా కలెక్టర్ అధికారులకు పలుమార్లు ఆదేశాలు జారీ చేస్తున్న కలెక్టర్ ఆదేశాలను బేకాతార్ చేస్తు అవేమి పట్టన్నట్లు వ్యవహరిస్తున్నారని వాపోయారు. విద్యుత్ తీగలు వేలాడకుండా స్థంభాలను ఏర్పాటు చేయాలని లైన్ మెన్ వంశీ ని ఆశ్రయిస్తే కర్రలు తెచ్చుకొండి పాతి పెడతాం అంటూ నిర్లక్ష్యంగా సమాధానాలు చెబుతున్నారని రైతులు మండిపడుతున్నారు. విద్యుత్ తీగలు ఎప్పుడు తెగి పైన పడుతాయోనని రైతులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. రైతుల పట్ల చిత్తశుద్ధి లేని అధికారులు వారి సమస్యలు ఎలా పరిష్కరిస్తారని, ఆవేదన చెందుతున్నారు. రైతుల సమస్యలను తీర్చడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని రెతు మల్లెష్ కోరుతున్నాడు.



## డ్రైనేజ్ అవుట్ లెట్ పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తా

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

జయభేరి, కాప్రా :

డ్రైనేజీ అవుట్ లేట్ పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం కాప్ర డివిజన్ కృప విల్లాస్ లో కాలనీ సమస్యల మీద ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని కొత్త పైపు లైన్, డ్రైనేజ్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్ DGM సతీష్, AE రోహిత్, BRS పార్టీ నాయకులు బైరీ నవీన్ గౌడ్, మధుకర్ నాయుడు, సంతోష్, బద్రయ్య, బస్వరాజు, సత్యనారాయణ, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 1వ వార్డ్ కి చెందిన అయోధ్యకాలనీ నూతన కార్యవర్గం ఏర్పడిన శుభ సందర్భంగా మేయర్ అమర్ సింగ్, డిప్యూటీ మేయర్, కాలనీ ప్రెసిడెంట్ ప్రభాకర్, జనరల్ సెక్రటరి వెంకన్న, అనిల్, రమణా రెడ్డి, ఎండీ కైసర్, వెంకటయ్య, రాంకిషన్ రావు, నరసింహ, శ్రీనివాస్ గౌడ్, దుర్గయ్య, క్రాంతి రెడ్డి, దేవేందర్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పప్పుల అంజి రెడ్డి, సుభాష్ నాయక్, సీనియర్ నాయకులు అల్వాల దేవేందర్ గౌడ్, బుచ్చి యాదవ్, తవిటి ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జయభేరి, మేడిపల్లి

## ఎంతో మంది పేద ప్రజలకు లబ్ది

- మేయర్ అమర్ సింగ్



జయభేరి, మేడిపల్లి :

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ కార్యాలయంలో 26వ డివిజన్ కి సంబంధించిన సీఎం సహాయ నిధి చెక్కులను అందించడం జరిగింది. సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ కార్యాలయంలో మేయర్ అమర్ సింగ్, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, కార్పొరేటర్లు భీమ్ రెడ్డి నవీన్ రెడ్డి, సుభాష్ నాయక్, సీనియర్ నాయకులు పప్పుల అంజిరెడ్డి, దేవేందర్ గౌడ్, కో ఆప్షన్ సభ్యులు ఇర్ఫాన్ సమక్షంలో లబ్ధిదారులకు అందజేశారు. ఆపదలో సీఎం సహాయ నీది ఆపద్బంధువునిగ ఆదుకుంటుంది అని తెలిపారు. వైద్య చికిత్స చేసుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఎన్నో కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆసరాగా నిలుస్తుంది, బాధితులు అవసరమైన సమయాల్లో సీఎం రిలీఫ్ ఫండ్ ను సద్వినియోగపర్చుకోవాలని అని తెలిపారు. పేదల సంక్షేమనికి తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుంది. అందులో భాగంగా అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఎంతో మంది పేద ప్రజలు లబ్ది పొందుతున్నారు.

## పొన్నాల లో బదిలీ పై వెళ్లిన ఉపాధ్యాయులకు వీడ్కోలు



జయభేరి, సెప్టెంబర్ 4:

మేడ్చల్ జిల్లా శామీర్ పేట మండలం పొన్నాల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఇటీవల పలువురు ఉపాధ్యాయులు బదిలీ పై వెళ్ళారు. కాగా వీరికి ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయులు సింగం సంజీవ, ఉపాద్యాయులు ఎం. రవీంద్రచారి, పవిత్ర గార్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి గ్రామ మాజి సర్పంచ్ సుకన్య సత్యనారాయణ, మాజి ఎంపీటీసీ ప్రసాద్ లు హాజరై బదిలీ అయిన వారిని పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు అనేవి సహజమేనని ఈ సంధర్భంగా పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ గడ్డం రమేష్, పాఠశాల కమిటీ ఛైర్మన్ మమత, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజయలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్, ఉపాద్యాయులు రాజు, వెంకటేశం, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## సయ్యద్ ఖాళీలోద్దీన్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణ పరిధిలోని 19వ వార్డులోని బి ఎస్ ఆర్ కాలనికి చెందిన, దేవరకొండ సుపరిచితులు రిటైర్డ్ ఎంఈఓ సయ్యద్ ఖాళీలోద్దీన్ భౌతిక కాయాన్ని దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ బుధవారం సందర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు బాధ్యత కుటుంబ సభ్యులకు ఓదార్చారు. భగవంతుడు వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు పట్టణ అధ్యక్షులు మొహమ్మద్ యునుస్, కౌన్సిలర్లు మొహమ్మద్ రయీస్, సైదులు ఆబిద్ అలీ, ఖాదర్ బాబా, అంకూరీ శివ, జగన్ నాయక్, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తా..

- భాజపా ఓబీసీ మోర్చా దేవరకొండ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ గా చిత్రాల నాగేంద్ర ఎన్నిక
- బిజెపి నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు



**జయభేరి, దేవరకొండ :**

భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా దేవరకొండ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ గా చిత్రాల నాగేంద్ర ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షులు పిట్టల శ్రీనివాస్,బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్న మౌని రాములు ఎన్నిక పత్రం అందజేశారు.ఎన్నికకు సహకరించిన ఎస్ సి మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకూరి నర్సింహ్మా, బిజెపి జిల్లా కార్యదర్శి వస్కుల సుధాకర్, నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ ఎటి కృష్ణ, పట్టణ అధ్యక్షులు గుండాల అంజన్న, పట్టణ ప్రధాన కార్యదర్శి జల్దా భాస్కర్,ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు నారాయణదాస్ చండీశ్వర్, లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అసెంబ్లీ కన్వీనర్ చిత్రాల నాగేంద్ర మాట్లాడుతూ తన పై నమ్మకం ఉంచి ఈ యొక్క పదవి ఇచ్చినందుకు బిజెపి నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

## ఖాళీలోద్దీన్ మృతి బాధాకరం



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలోని 19వ వార్డుకు చెందిన రిటైర్డు MEO ఖాళీలోద్దీన్ మృతి బాధాకరం అని నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.బుధవారం దేవరకొండ పట్టణంలోని 19వ వార్డులో ఖాళీలోద్దీన్ మృత దేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఖాళీలోద్దీన్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఖాళీలోద్దీన్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.ఆయన వెంట బాబా, ఇలియస్ పటేల్, చంద్రమౌళి, అఫ్రోజ్, ఖాజా, తదితరులు ఉన్నారు.

## అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలి

- ఎలాంటి ఆస్తి నష్టం, ప్రాణనష్టం జరగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలి
- విష జ్వరాలు ఉన్న గ్రామాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించండి

**జయభేరి, మంథని:**

రాష్ట్రవ్యాప్తంగా గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ప్రజలకు సూచించారు.బుధవారం మంథని పట్టణ శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరినదీ నీటి ప్రవాహాన్ని భారీ వర్షం లోనే మంత్రి శ్రీధర్ బాబు పరిశీలించారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా వరుసగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తూ ఎలాంటి ఆస్తి నష్టం, ప్రాణనష్టం జరగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులు అప్రమత్తంగా ఉన్నారని, విపత్తును ఎదుర్కోవడానికి మా ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. మహారాష్ట్రల కురుస్తున్న భారీ వర్షాలు, మన రాష్ట్రంలోని ప్రాజెక్టులకు వస్తున్న వరదను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ వరద నీటిని అధికారులు దిగువకు వదులుతున్నారని తెలిపారు. కాలువలలో మురికినీరును, అక్కడక్కడ చెత్తాచెదారాలను వెంట వెంటనే క్లీన్ చేయాలని మున్సిపల్ సిబ్బంది పనిచేయాలని ఆదేశించారు, గత ఐదు రోజుల నుండి కురుస్తున్న వర్షాల వల్ల దోమల ద్వారా వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రభుత్వ వైద్యాధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఏ గ్రామంలో విష జ్వరాలు వస్తే ఆ గ్రామాన్ని వెంటనే హెల్త్ క్యాంపు నిర్వహించి వారికి వైద్య సదుపాయం అందించాలన్నారు. మంథని నియోజకవర్గంలో ప్రభుత్వాసుపత్రికి వచ్చే ప్రతి వ్యక్తికి మెరుగైన వైద్య సదుపాయాన్ని ఇవ్వాలని జిల్లా వైద్య అధికారులను మంత్రి ఆదేశించారు. విపత్తును ఎదుర్కోవడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని,లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం వ్యవసాయ అధికారితో ఫోన్లో మాట్లాడుతూ ఎక్కడైతే పంట నష్టం జరిగిందో అధికారులు వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి ఆ రైతులకు ధైర్యం చెప్పి స్పష్టంగా పంట నష్టం ఎంత జరిగిందో చూడాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

# పర్యటనలకు మాత్రమే పరిమితమైన ప్రజాప్రతినిధులు.. అధికారులు

- గత ప్రభుత్వం మంజూరు చేసిన SNDP నిధులను విడుదల చేసి పీర్జాదిగూడ కార్పొరేషన్ లో మిగిలి పోయిన వరద నీటి డ్రైన్ పనులను వెంటనే పూర్తి చేయాలి
- అభివృద్ధి కోసమే పార్టీ మారిన కార్పొరేటర్లు SNDP నిధులు తీసుకురావాలి
- వదలని వర్షాలతో, వరద నీటితో ప్రజల కష్టాలు వర్ణనాతీతం
- ప్రభలుతున్న జ్వరాలు, ఖాళీ లేని ధవాఖానాలు
- వెంటనే పరిష్కారం చూపాలని పీర్జాదిగూడ
- బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడవెల్లి రఘువర్ధన్ రెడ్డి డిమాండ్






**జయభేరి, మేడిపల్లి :**

గతంలో భారీ వర్షాలు కారణంగా పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో పలు కాలనీలలో ఇండ్లు మునిగి ఆస్తి నష్టం జరగడం... చెరువు కట్టలు తెగి బారి నష్టాన్ని చూడడం జరిగింది. గత ప్రభుత్వం HMDA నిధుల ద్వారా చెరువు కట్టలు నిర్మించి సుందరికరించడం జరిగింది. ఇక వరద నీటిని పైప్ లైన్ ద్వారా మూసిలోకి పంపించడానికి ప్రత్యేకంగా SNDP నిధులను జంట కార్పొరేషన్ లకు కేటాయించడం... కొంత మేరకు పర్వతాపూర్ చెరువు నుండి మూసికి పెద్ద చెరువు నుండి మూసికి వెళ్లేలా పనులు జరిగాయి. తద్వారా కొన్ని కాలనీలకు వరద నీటి ముంపు ముప్పు తప్పింది.

అయితే ఇంకా పర్వతాపూర్ చెరువు నుండి బచ్పన్ స్కూల్ మేడిపల్లి మీదుగా చెంగిచెర్ల చెరువుకు మరియు పెద్ద చెరువు బండిగార్డెన్ రోడ్డు మీదుగా బోడుప్పల్ రా చెరువు వరకు పనులు చేయాల్సి ఉంది. అప్పుడు గాని అన్ని ముంపు కాలనీలకు పరిష్కారం దొరకదు. ఇప్పుడు అధికారులు ప్రజాప్రతినిధులు వరదల సమయంలో పర్యటించి కంటితుడుపు చర్యలు తప్ప వరద, బురదనీటి నుండి ప్రజలను కాపాడే పరిస్థితి లేదు.... ప్రభుత్వం మారడంతో SNDP నిధులు నిలిచిపోయాయి. ప్రభుత్వం మారడం వెంటనే నలుగురైదుగురు తప్ప మిగతా కార్పొరేటర్లు పనులు చేయడానికి, నిధులు తేవడానికే అధికారంలో ఉన్న పార్టీలో చేరుతున్నామని చెబుతూ అధికార పార్టీలో చేరారు. అయితే ఇలాంటి పరిస్థితి వస్తుందని తెలిసి ఇప్పటి వరకు కార్పొరేషన్ దాటి రాష్ట్ర ప్రభుత్వ ఖజానా నుండి పీర్జాదిగూడ కార్పొరేషన్ కి నిధులు అడగక పోవడం గమనార్హం.....

ఇకనైనా ఇక్కడ అక్కడ మీ అధికారమే ఉన్నందున వరద నీటి సమస్య పరిష్కారానికి వెంటనే SNDP పనులకు నిధులు తీసుకురావాలని అలాగే పీర్జాదిగూడ నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం పూర్తిచేయడానికి HMDA నిధులను మంజూరు చేయించి వెంటనే అట్టి నాలుగు లైన్ల పీర్జాదిగూడ నుండి పర్వతాపూర్ రోడ్డును పూర్తి చేయాలని, కార్పొరేషన్ లో ప్రజలు డెంగ్యూ జ్వరాలతో ఇబ్బంది పడుతున్నారు, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల, వరదల కారణంగా పలు కానీలలో మురుగు నీరు చేరి వాసన మరియు దోమల పెరుగుదలకు కారణం అవుతున్నందున మోటర్ల ద్వారా మురుగునీటిని డ్రైన్లలోకి పంపాలని, దోమల లార్వా/ గుడ్ల నివారణకు ఆయిల్ బాల్స్ వేయడం తో పాటు బ్లీచింగ్ చేయాలని, రాత్రి 8 గంటల లోపు దోమల పాగింగ్ చేపట్టాలని బిఆర్ఎస్ పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నాము.

# ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు

- అక్రమ రేషన్ బియ్యం దందాకూ పాల్పడిన రేషన్ డీలర్లు ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వి. వెంకటేశ్వర్లు



**జయభేరి, దేవరకొండ :**

అక్రమ రేషన్ బియ్యం దందాకూ పాల్పడిన రేషన్ డీలర్లు ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి వి. వెంకటేశ్వర్లు హెచ్చరించారు. బుధవారం సాయి శివ గార్డెన్లో ఏర్పాటుచేసిన మండల స్థాయి రేషన్ డీలర్ల సమీక్ష సమావేశంలో పౌరసరఫరాల అధికారి తోపాటు, సిఐ నరసింహులు, ఆర్డీవో శ్రీరాములు, దేవరకొండ డిటిసిఎస్ హనుమంతు శ్రీనివాస్ గౌడ్, నాంపల్లి డిటిసిఎస్ సైదులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పౌరసరఫరాల అధికారులు మాట్లాడుతూ ఏ రేషన్ డీలర్ అయినా అక్రమ రేషన్ బియ్యం దందాను ప్రోత్సహిస్తే అట్టి వారిపై నాన్ వెలబుల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. రేషన్ డీలర్లు సమాజంలో గౌరవప్రదంగా బ్రతకాలని, రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేసి జైలు పాలు కాకూడదని, అక్రమ బియ్యం సరఫరా చేస్తే రేషన్ డీలర్ల పై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్క రేషన్ డీలర్ ఆథరైజ్డ్ రెన్యువల్ చేసుకొని,స్టాక్ పట్టికను సూచిక బోర్డులో నమోదు చేయాలన్నారు. రేషన్ షాపును కచ్చితంగా ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు వినియోగదారులకూ అందుబాటులో ఉండాలని, ఒకవేళ ముందస్తు సమాచారం లేకుండా ఏ రేషన్ డీలర్ అయినా రేషన్ షాపుకు తాళం వేసినట్లయితే కేసులు నమోదు చేస్తామని అన్నారు. రేషన్ షాపులలో రేషన్ సరుకులు తప్ప మిగతావి ఏవి ఉండకూడదని హెచ్చరించారు. ముఖ్యంగా ఏ రేషన్ డీలర్ కూడా రాజకీయ పార్టీలతో సంబంధం పెట్టుకోకూడదని, రాజకీయ సమావేశాలలో పాల్గొనకూడదని హెచ్చరించారు. కార్డుదారులు వేలిముద్ర రానట్లయితే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. అంత్యోదయ కార్డుదారులకుచెక్కెర పంపిణీ కూడా ఉంటుందని కావున ప్రతి ఒక్క డీలర్ షుగర్ డీడీలు కూడా చెల్లించాలని తెలిపారు. ప్రతి ఒక్క రేషన్ డీలర్ సరైన పద్ధతిలో వినియోగదారులకు సేవలు అందించాలని తెలిపారు.






## డీఎస్సీ కీ విడుదల

**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 4:**

తెలంగాణ ఉపాధ్యాయ నియామక పరీక్ష 2024 ఫలితాలు ఎప్పుడెప్పుడు విడుదలవుతాయా అని రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులు వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే ప్రాథమిక ఆన్సర్ కీ విడుదలవగా.. ఈ రోజు తుది కీ విడుదల అవనుంది. ఈ మేరకు డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షల తుది కీ విడుదలకు పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తుంది. ఇప్పటికే ఇందుకు సంబంధించిన మొత్తం ప్రక్రియను పూర్తి చేసిన అధికారులు మరోసారి చెక్ చేసేందుకు తెలంగాణ ఆన్‌లైన్‌కు పంపారు. తుది ఆన్సర్ కీ విడుదలైన తర్వాత పరీక్ష రాసిన అభ్యర్థులు ఎవరికి వారు తుది కీ ప్రకారం తమకు పరీక్షల్లో ఎన్ని మార్కులు వచ్చాయో తెలుసుకునే అవకాశం ఉంటుంది. తుది కీ ప్రకటన తర్వాత రెండు మూడు రోజుల్లో డీఎస్సీలో 80 మార్కులకు టెట్ వెయిటేజీ 20 మార్కులను కలిపి.. వంద మార్కులకు వచ్చిన ర్యాంకులను జిల్లాల వారీగా జనరల్ ర్యాంకు లిస్టును విడుదల చేస్తారు.కాగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 11,062 ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. జులై 18 నుంచి ఆగస్టు 13 వరకు డీఎస్సీ పరీక్షలు ఆన్‌లైన్ విధానంలో జరిగాయి. ఆన్‌లైన్ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 2.45 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. సబ్జెక్టుల వారీగా ప్రాథమిక కీలను ఆగస్టు 13న విడుదల చేయగా.. ఆగస్టు 20వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అభ్యంతరాలు స్వీకరించారు. డీఎస్సీలో అడిగిన ప్రశ్నలపై దాదాపు 28 వేలకు పైగా అభ్యంతరాలు వచ్చాయి. దీంతో తుది కీలో ఎన్ని ప్రశ్నలకు సమాధానాలు మారుతాయోనన్న ఆసక్తి ప్రతి ఒక్కరిలో నెలకొంది.ముందుగా అనుకున్నట్లుగానే పరీక్షల తుది కీ బుధవారం (సెప్టెంబరు 4న) విడుదల చేస్తే.. రెండు, మూడు రోజుల్లోనే టెట్ మార్కులను కలిపి జిల్లాల వారీగా జనరల్ ర్యాంకు లిస్టును విడుదల చేయాలని పాఠశాల విద్యాశాఖ సమాయత్తమవుతోంది. అనంతరం జిల్లాల వారీగా రిజర్వేషన్ల ప్రకారం 1:3 నిష్పత్తిలో మెరిట్ జాబితా తయారు చేసి ప్రకటిస్తారు. ఫలితాలు విడుదలయ్యాక డీఈఓలు ధ్రువపత్రాల పరిశీలన చూపడతారు. అనంతరం మెరిట్ ప్రాతిపదికన నియామక ఉత్తర్వులు జారీ చేస్తారు.

# అమెరికాలో ప్రమాదం

## నలుగురు హైదరాబాదీలు మృతి

- హైదరాబాద్‌కు చెందిన ఫరూక్ షేక్ మాస్టర్స్ డిగ్రీ కోసం మూడేళ్ల క్రితం అమెరికా
- వేగంగా వచ్చిన ట్రక్ అదుపుతప్పి ఎస్‌యూవీ వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది

**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 4**

అమెరికాలోని టెక్సాస్‌లో 5 వాహనాలు ఒక దానికొకటి ఢీకొన్న ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు హైదరాబాదీలతో సహా నలుగురు భారతీయులు మరణించారు. అందరూ ఒకే SUVలో భారతీయ కార్‌పూలింగ్ యాప్ ద్వారా అర్కాన్సాస్‌లోని బెంటన్‌విల్లేకు ప్రయాణిస్తున్నారు. మృతులను హైదరాబాద్‌కు ఆర్యన్ రఘునాథ్ ఓరంపాటి, ఫరూక్ షేక్, లోకేష్ పాలచర్ల, తమిళనాడుకు చెందిన దర్శిని వాసుదేవన్‌లుగా గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కొల్లిన్ కౌంటీ షెరీఫ్ కార్యాలయం వైట్ స్ట్రీట్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది.. వేగంగా వచ్చిన ట్రక్ అదుపుతప్పి ఎస్‌యూవీ వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. ఆ తర్వాత ట్రక్కు మరో నాలుగు వాహనాలను ఢీకొని డివైడర్‌ను ఢీకొట్టింది. అందరూ తేరుకునేలోపే SUV వాహనం మంటల్లో చిక్కుకుంది. నలుగురు భారతీయులు కారులో చిక్కుకున్నారు. మంటల కారణంగా నలుగురూ సజీవదహనమయ్యారు. కార్‌పూలింగ్ యాప్ ద్వారా స్థానిక పోలీసులు వారిని గుర్తించారు.హైదరాబాద్ నివాసి ఆర్యన్ రఘునాథ్ ఓరంపాటి అతని స్నేహితుడు ఫరూక్ షేక్‌తో కలిసి డల్లాస్‌లోని తమ బంధువు వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. కాగా, లోకేష్ తన భార్యను కలవడానికి బెంటన్‌విల్లేకు వెళ్తున్నాడు. ఇక తమిళనాడుకు చెందిన ధరిణి వాసుదేవన్ టెక్సాస్ యూనివర్సిటీలో ఎంఎస్ చదివిన తర్వాత అక్కడే పనిచేస్తున్నారు. ఆమె బెంటన్‌విల్లేలోని తన మామ వద్దకు వెళ్తున్నారు. ఈ నలుగురూ కార్‌పూలింగ్ యాప్ ద్వారా కనెక్ట్ అయిన తర్వాత అర్కాన్సాస్‌లోని బెంటన్‌విల్లేకు వెళుతుండగా ప్రమాదం జరిగింది.హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన ఆర్యన్ ఓరంపాటి ఇటీవలే ఇంజినీరింగ్ పూర్తి చేసి అమెరికాకు వెళ్లాడు. అతని తండ్రి సుభాష్ చంద్రారెడ్డి హైదరాబాద్‌లో వ్యాపారవేత్త. హైదరాబాద్‌కు చెందిన ఫరూక్ షేక్ మాస్టర్స్ డిగ్రీ కోసం మూడేళ్ల క్రితం అమెరికా వెళ్లి బెంటన్‌విల్లేలో నివసిస్తున్నాడు.భారతీయులంతా కాలిపోయిన తర్వాత వారి మృతదేహాలను గుర్తించడం కష్టంగా మారింది. వారి శరీర భాగాల నమూనాలను DNA పరీక్ష కోసం ఉంచారు. 3 రోజుల తర్వాత కుమార్తె మృతి చెందిన విషయం ధరిణి తండ్రికి తెలిసింది. అంతకు ముందు, తన కూతురు అదృశ్యంపై సమాచారంతో ట్విట్టర్‌లో విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ సహాయం కోరారు. కాగా, వారి అవశేషాలు భారత్ రప్పించేందుకు బాధితుల కుటుంబాలు విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారుల సహాయాన్ని కోరుతున్నాయి.

## మోసగాడి అరెస్టు

**జయభేరి, కదిరి:**


కదిరి నియోజకవర్గం, నల్లచెరువు మండల కేంద్రంలో అద్దె ఇంట్లో ఉంటూ తక్కువ ధరలకే చక్కెర, సిగరెట్లు ఇస్తానంటూ నమ్మించి వ్యాపారం పేరిట అప్పులు తీసుకుని వంచించిన చిన్న ఓబులేశు అలియాస్ మహేశ్వరరెడ్డి ని పోలీసులు అరెస్టు చేసినట్లు కదిరి డీఎస్పీ శ్రీలత తెలి పారు. గార్లదిన్నె మండలం, కొప్పలకొండ గ్రామంకు చెందిన చిన్న ఓబులేశుపై రాయలసీమ జిల్లాలతో పాటు ఉభయ గోదావరి జిల్లాలోనూ 24 కేసులు నమోదైనట్లు డీఎస్పీ చెప్పారు. నిందితుడు వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ పేర్లు మార్చుకుని అధిక వడ్డీలు, తక్కువ ధరలకు సరకులు ఇప్పిస్తానంటూ నల్లచెరువు మండలం దామావాండ్లపల్లికి చెందిన నీలకంఠారెడ్డి నుంచి రూ. 90 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఆయనతో పాటు మరో 18 మంది నుంచి రెండున్నర కోట్ల రూపాయలు అప్పుగా తీసుకుని మోసగించినట్లు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి, నకిలీ బంగారు వస్తువులు స్వాధీనం చేసుకుని రిమాండ్ కు తరలించినట్లు డీఎస్పీ వివరించారు.




# ఎన్నాళ్లకెన్నాళ్లకు..

చివరగా కిసీ కా భాయ్ కిసీ కీ జాన్, సర్కస్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకొచ్చింది పూజా హెగ్డే. ఈ రెండు సినిమాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి. ఈ భామ నెక్ట్స్ హై బడ్జెట్ యాక్షన్ థ్రిల్లర్‌గా రాబోతున్న దేవ చిత్రంలో నటిస్తోంది. బాలీవుడ్ స్టార్ యాక్టర్ షాహిద్ కపూర్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. మాలీవుడ్ డైరెక్టర్ రోషన్ మాథ్యూ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమాతో బీటౌన్ ఎంట్రీ ఇస్తున్నాడు రోషన్ మాథ్యూ. తాజాగా ఈ మూవీ షూటింగ్ అప్‌డేట్ అందించింది పూజా హెగ్డే. దేవలో తన పార్టుకు సంబంధించి చిత్రీకరణ పూర్తయినట్టు తెలియజేసింది. మా సినిమాలో భాగమైన మీకు, మీ అద్భుతమైన పని తీరుకు హృదయపూర్వక ధన్యవాదాలు. మీ శ్రద్ధ, జ్ఞానం సెట్‌కు జీవం పోసింది. ఈ విషయం సినిమాలో కనిపించనుంది. ఎప్పుడూ మెస్మరైజ్ చేస్తూ ఉండాలని.. ప్రేమతో.. అంటూ ఓ పోస్ట్ షేర్ చేసింది దేవ టీం.





# 50కోట్ల బడ్జెట్.. 500కోట్ల కలెక్షన్స్

కథలో విషయం ఉంటే చాలు తారల ఇమేజ్‌తో సంబంధం లేకుండా సినిమాలకు ప్రేక్షకులు బ్రహ్మరథం పడతారని బాలీవుడ్ చిత్రం 'స్త్రీ2' నిరూపిస్తున్నది. 50 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కించిన ఈ హారర్ థ్రిల్లర్ కేవలం 20 రోజుల్లోనే 515కోట్ల వసూళ్లను రాబట్టి సంచలనం సృష్టించింది. అమర్ కౌశిక్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో శ్రద్ధాకపూర్, రాజ్‌కుమార్ రావు, అభిషేక్ బెనర్జీ ప్రధాన పాత్రల్ని పోషించారు. 2018లో వచ్చిన 'స్త్రీ' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందిన ఈ సినిమాలోని హారర్ ఎలిమెంట్స్, కథలోని అనూహ్య మలుపులు, తలలేకుండా కేవలం మొండెంతో కనిపించే విలన్ సర్కతా పాత్ర హైలైట్‌గా నిలుస్తున్నది. 'స్త్రీ2' చిత్రం బాక్సాఫీస్ వద్ద మరిన్ని రికార్డులు క్రియేట్ చేస్తుందని, దసరా వరకు లాంగ్ రన్ ఉంటుందని ఫిల్మ్ ట్రేడ్ ఎనలిస్ట్ తరణ్ ఆదర్శ్ తన ట్విట్టర్ ఖాతాలో పేర్కొన్నారు.




# 'జనక అయితే గనక' వాయిదా

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల వల్ల తలెత్తిన పరిస్థితుల నేపథ్యంలో 'జనక అయితే గనక' సినిమా రిలీజ్‌ను వాయిదా వేస్తున్నట్లు అగ్ర నిర్మాత దిల్ రాజు ప్రకటించారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ సినిమా ఈ నెల 7న విడుదల కావాల్సి ఉంది. రెండు రాష్ట్రాల్లో సాధారణ పరిస్థితులు నెలకొన్న తర్వాత కొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని దిల్‌రాజు పేర్కొన్నారు. సుహాస్, సంగీర్తన జంటగా నటించిన 'జనక అయితే గనక' చిత్రానికి సందీప్‌రెడ్డి బండ్ల దర్శకత్వం వహించారు. దిల్‌రాజు ప్రొడక్షన్స్ పతాకంపై హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించారు. వినోదాత్మక కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు.

# హరీష్ శంకర్‌కు నో..

## మహేశ్ బాబు సినిమాకు సై...

టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని నటించిన డబుల్ఇస్మార్ట్ భారీ అంచనాల మధ్య విడుదల కాగా.. ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఇంప్రెస్ చేయలేకపోయింది. ఇక మిస్టర్ బచ్చన్ ప్రమోషనల్ ఈవెంట్‌లో హరీష్ శంకర్ ఫైనల్ స్క్రిప్ట్‌ను త్వరలోనే రామ్‌కు అందిచండంతోపాటు సినిమా అనౌన్స్‌మెంట్ ఉంటుందని హింట్ ఇచ్చాడు. అయితే ఫిలిం నగర్ సర్కిల్ కథనాల ప్రకారం హరీష్ శంకర్‌తో సినిమా చేసేందుకు రామ్ రెడీగా లేడట. స్కంద, వారియర్, డబుల్ ఇస్మార్ట్ నిరాశపర్చడం, మరోవైపు హరీష్ శంకర్ మిస్టర్ బచ్చన్ బోల్తా కొట్టడంతో సరైన కథ దొరికే వరకు మాస్ సబ్జెక్టును పక్కన పెడితే బాగుంటుందని రామ్ భావిస్తున్నాడని వార్త నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఇక ముందుగా వచ్చిన వార్తల ప్రకారం మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి ఫేం పీ మహేశ్ బాబు డైరెక్షన్‌లో సినిమా చేసేందుకు రెడీ అవుతున్నాడని టాక్ నడుస్తోంది. ఈ క్రేజీ సినిమా షూటింగ్ సెప్టెంబర్‌లో మొదలు కానుందంటూ వార్తలు రాగా.. మరి రామ్ నుంచి ఏదైనా అధికారిక ప్రకటన వస్తుందేమో చూడాలంటున్నారు సినీ జనాలు. టాలీవుడ్ లీడింగ్ ప్రొడక్షన్ హౌజ్ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని తెరకెక్కించనుందని తెలుస్తోంది. మరి మహేశ్ బాబు ఎనర్జిటిక్ యాక్టర్ రామ్‌ను ఎలా చూపించబోతున్నాడన్నది సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.






# వెకేషన్‌లో మేఘా ఆకాశ్..

టాలీవుడ్ భామ మేఘా ఆకాశ్ ఇటీవలే తన ప్రియుడు సాయి విష్ణు తో నిశ్చితార్థం పూర్తి చేసుకున్న విషయం తెలిసిందే. ఈ విషయాన్ని తెలియజేస్తూ మేఘా ఆకాశ్ షేర్ చేసిన ఫొటోలు ఇప్పటికే నెట్టింట వైరల్ అవుతున్నాయి. వెడ్డింగ్‌కు ఇంకా సమయం ఉండటంతో మేఘా ఆకాశ్‌సాయి విష్ణు వెకేషన్ టూర్ ప్లాన్ చేశారు. కొప్పులో అందమైన పూలు పెట్టుకొని.. లంచ్ టేబుల్ ముందు కూర్చొని కెమెరాకు క్యూట్ క్యూట్‌గా ఫోజులిచ్చింది. ఇంతకీ ఈ భామ ఎక్కడికెళ్లిందనే కదా మీ డౌటు. ఐలాండ్ నేషన్ శ్రీలంకకు వెళ్లింది. తన గర్ల్ గ్యాంగ్‌తో జరుపుకున్న బ్యాచ్‌లర్ పార్టీ ట్రిప్‌కే హైలెట్‌గా చెప్పొచ్చు. మేఘా ఆకాశ్ వెకేషన్ స్టిల్స్ ఇప్పుడు నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. లై, ఛల్ మోహన్ రంగా సినిమాలతో తెలుగు ప్రేక్షకులను పలుకరించింది మేఘా ఆకాశ్. ఆ తర్వాత డియర్ మేఘ, గుర్తుందా సీతాకాలం చిత్రాల్లో మెరిసింది. మేఘా ఆకాశ్ ప్రస్తుతం వికటకవి, సహకుటుంబం సినిమాల్లో నటిస్తోంది. మరి వివాహం తర్వాత ప్రొఫెషనల్ లైఫ్‌ను కొనసాగిస్తుందా..? లేదా.,? అంటూ తెగ చర్చించుకుంటున్నారు సినీ జనాలు.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com